ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025

5

అల్లూరి సీతారామరాజు



నేటి చలో కలెక్టరేట్ వాయిదా

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 17న నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పాడేరులో లేని కారణంగా వాయిదా వేసినట్లు ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనరస, అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తాపుల కృష్ణ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం తదుపరి తేదీని పాడేరులో జరిగే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ నాయకుల తో నిర్వహించే సమావేశంలో ప్రకటిస్తామన్నారు. ఈనెల 19న అనంతగిరి మండలం గుమ్మకోట గ్రామంలో నిర్వహించే "అరణ్య గర్జన" బహిరంగ సభను జయప్రదం చేయాలని పాడేరు జిల్లా కేంద్రం నుండి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ పిలుపునిస్తోందని చెప్పారు. ఈ సభలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేకంగా గళమెత్తి, పర్యావరణ పరిరక్షణ, స్థానికుల హక్కుల కోసం పోరాడేందుకు అందరూ పాల్గొనాలని కోరారు.

హైడ్రో పై కపట నాటకాలు

- జిఒలు రద్దయ్యే వరకూ పోరాటం ఆగదు
- మోడీ పర్యటనపై గిరిజనుల ఆగ్రహం
- మన్యంలో వెల్లువెత్తిన నిరసనలు



చింతపల్లిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టల ఒప్పందాలు, జారీ చేసిన జీవోలు, పర్యావరణ అనుమతులు వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నేతలు పిలుపునిచ్చారు. హైడ్రోపై ప్రభుత్వాలు కపట నాటకాలు అడొద్దని నినాదాలు చేశారు. లోతేరు, అడారి గ్రామల్లో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కో- కన్వీనర్ కిల్లో నోబో అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి,హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు జారీ చేసిన జీఓలు 2, 13, 51 రద్దు చేయాలని, రెండు నెలల నుండి పోరాటాలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి తాత్కాలికంగా పనులు ఆపినట్టు ప్రకటించారని, ఈ అంశం రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించారా.. లేక గిరిజన సలహా మండలిలో చర్చించి పనులు ఆపాలని తీర్మానం చేసారా స్పష్టం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదివాసుల నిరసనకు అనుమతి లేదని చెబుతున్నారని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఒప్పందాలు ఎవరిని అనుమతి అడిగి చేసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు, జీఓలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాలపై పర్యావరణ అనుమతులు ఇచ్చిందని, ఆదివాసి ప్రాంతంలో రోడ్లు వేస్తామంటే అనేక సాకులు చెప్పి ఫారెస్ట్ చట్టం పేరుతో ఆపేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూజారి త్రినాథ్, పెసా కమిటీ సభ్యులు భీమ, పోరాట కమిటీ నాయకులు రామచందర్, అప్పలస్వామి, త్రినాథ్, స్వాభి మంగళయ్య, కిల్లో మొద్దు, ఆనంద్, శోభన్, కిల్లో భీమల, చంప, ముక్తా, తులాసమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.



అడారిలో నినాదాలు చేస్తున్న గిరిజనులు, నాయకులు

అరకులోయ రూరల్: హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జిఓల రద్దు కు స్పష్టమైన ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు, నల్ల జెండాలు కట్టుకుని నిరసన చేపట్టారు. అరకులోయ మండలం లోతేరు పంచాయితీ అంటిపర్తి, కాగువలస, దూదుకొండి, అడ్డుమండ, పొలిగూడ, ముసిరిగూడ, అడారి ఇరగాయి పంచాయతీ వల్లిపనస, మొర్రిగుడ, చెంద్రుపోదర్, దవడగూడ, బస్కి పంచాయతీ గుగ్గుడు, బస్కీ వివిధ గ్రామాల్లో ఎక్కడికి అక్కడే నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నొబో, బి.దశరథ్, నర్సింగ్, రామరచంద్ర, సింహాద్రి, కె స్వామి, బాబురావు మాట్లాడుతూ, హైడ్రో ప్రాజెక్ట్‌లతో పంట పొలాలు, భూములు, జల సమాధి చేస్తామంటే ఊరుకునేది లేదని ధ్వజ మెత్తారు. ఈ కార్యక్రమంలో పేసా కమిటీ సభ్యులు కె.మోహన్‌రావు, భీమా, రామ్మూర్తి, పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో..

దుంబ్రిగుడ: ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని, రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గిరిజనులు కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ, గిరిజనులకు కల్పించిన చట్టాలను ఉల్లంఘిస్తూ హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు సాగిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస, తుంబవలస గ్రామాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం పోరాట కమిటీ నాయకులు టి.కృష్ణారావు, కన్వీనర్ కృష్ణంరాజు నాయకత్వంలో గ్రామస్తులు గురువారం నల్లజెండాలతో నిరసన తెలిపారు. జీఓ నంబర్లు 51, 13, 2లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. జీఓలు రద్దు చేయకపోతే మా పోరాటం ఆగదు అని వారు స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతగిరి: హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి జారీ చేసిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలని మండలంలోని వేంగడ, టోకూరులో ఆ సంఘం కమిటీ సభ్యులు ధర్నా చేపట్టారు. కళ్ళకు గంతులు కట్టి ఆందోళన చేపట్టారు. టోకూరు పంచాయతీ చిటంవలస, కంభవలస, రాయవలస, పింపోలుగూడ, వేంగడ, గోమంగిపాడు, గద్యయావలస, డాలింపుట్టు, డొంకపుట్టు, మెట్టువలస, భూర్జ తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. పోరాట కమిటీ కన్వీనర్ సివెరి. కొండలరావు, సభ్యులు ఎస్.రామన్న, మజ్జి.అప్పాన్న, మద్దు. రాము, శంకర్, సింహాద్రి, గిరిజనులు పాల్గొన్నారు.



హుకుంపేటలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

చింతపల్లి : 5వ షెడ్యూల్ భూభాగమంతా ఆదివాసీలదేనని, హైడ్రల్ పవర్ ప్రాజెక్టులు, పంపుడు స్టోరేజ్‌ల పేరుతో గిరిజన భూములను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఎర్రవరం కన్వీనర్ బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. గురువారం ఎర్రవరం గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గిరిజనులు నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకొని, ప్లకార్డులు చేత పట్టుకొని నిరసన తెలిపారు. 'నరేంద్ర మోడీ గో బ్యాక్', '2, 13, 51 జీవోలు రద్దు చేయాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ 1995లో సమత స్వచ్ఛంద సంస్థ, టాటా-బిర్లా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, ఏజెన్సీలోని భూములపై చట్టపరమైన అధికారం గవర్నర్, రాష్ట్రపతులకు తప్ప పరిపాలనా ప్రభుత్వాలకు లేదని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పును విస్మరిస్తూ బడా కంపెనీలకు గిరిజన భూములను అప్పగించడానికి జీవోలు జారీ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కో-కన్వీనర్లు గూడెపు రాజు, వెంకటేశ్వర్లు, కృష్ణరాజు, గోపి, చిన్నరాజు, గిరిజనులు పాల్గొన్నారు.

పెదబయలు : పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులుపేట గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గో బ్యాక్ నరేంద్ర మోడీ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల ప్రధాన కార్యదర్శి బోండా గంగాధర మాట్లాడుతూ ఏజెన్సీలో హైడ్రోపవర్, పంపుడ్ స్టోరేజీ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



అనంతగిరిలో...

కాఫీ తోటలకు పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం

- జాబితాల్లో వ్యత్యాసంపై రైతుల ఆందోళన



రిలే దీక్షలు చేస్తున్న కాఫీ రైతులు

ప్రజాశక్తి -జికే వీధి : జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో మండలంలోని పెదవలస, చాపరాతిపాలెం గ్రామాల్లో కాఫీ రైతులు నష్టపోతున్న తోటలకు తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. పెదవలసలో కాఫీ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరిన సందర్భంగా దీక్ష శిబిరంలో వారికి రింతాడ ఉపసర్పంచ్ సోమేష్ కుమార్, పీసా కార్యదర్శి మల్లేష్, పలువురు ఆదివాసి యువకులు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హైవే నిర్మాణంలో కోల్పోతున్న కాఫీ తోటలకు సంబంధించి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎపిఎఫ్‌డిసి సెప్టెంబర్ లో ప్రకటించిన పరిహార జాబితాలో 38 మంది రైతులకు రూ.4,18,29, 808 చెల్లించాల్సి ఉందన్నారు అయితే కాఫీ రైతులకు పరిహారం చెల్లించకుంఆ పనులు చేపట్టడంతో వాటిని అడ్డుకొని పెదవలసలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన రైతుల పోరాటాన్ని స్పందించిన పాడేరు ఐటిడిఎప్రాజెక్ట్ అధికారి దీక్ష శిబిరాన్ని సందర్శించి రైతులకు భరోసా ఇచ్చారన్నారు. తాజాగా ప్రకటించిన పరిహార జాబితాలో 38 మంది రైతులకు రూ.40, 63, 342గా ప్రకటించారని రైతులు అంటున్నారు. . మొదటి జాబితాలో పూజారి రామలింగం అనే రైతుకు 118 కాఫీ మొక్కలకు రూ.2,82,579 పరిహారంగా పేర్కొన్న అధకారులు, అదే రైతుకు రెండో జాబితాలో రూ.41,036 కుదించారన్నారు. పరిహారం జాబితాలో వ్యత్యాసాలపై రైతలుఉ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో దీనిపై అధికారులు స్పష్టత నివ్వాలని కోరారు. రోడ్డు నిర్మాణంలో అధికారులు,హైవే ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు చూపిస్తున్న శ్రద్ధ, నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లింపు, వారి సమస్యల పరిష్కారంలో చూపడం లేదని సోమేష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి, వాటిని పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రం చేయక తప్పదని హెచ్చరించారు.

పిహెచ్‌సి వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి



వైద్యసేవలపై ఆరా తీస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- కూనవరం : పిహెచ్‌సి వైద్యుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చి, సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. వైద్యుల సమ్మెతో సరైన సేవలు అందక పేద గిరిజనులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కూటూరు పిహెచ్‌సిని సిపిఎం నేతల బృందం సందర్శించింది. అక్కడ అందుతున్న వైద్యసేవలు, రోగుల ఇబ్బందులను పరిశీలించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటూరు పిహెచ్‌సిలోని ఇద్దరు వైద్యుల సమ్మెతో రోగులకు సరైన సేవలు అందని పరిస్థితుల్లో ఒపి గణనీయంగా తగ్గిందన్నారు. అత్యవసర రోగులు ప్రయివేటు ఆసుపత్రులకు వెళుతున్నారన్నారు. ప్రస్తుతం పిహెచ్‌సిలో ఆయుష్ విభాగం డాక్టర్ సేవలు అందిస్తున్నా, అల్లోపతిక్ మందులు ఇవ్వడంతో ఇబ్బందులతో రోగులకు అవస్థలు పడుతున్నారన్నారు.ఇప్పటికే మారుమూల గ్రామాలకు 104 వైద్యసేవలు అందక పేదప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇపుడు వైద్యుల సమ్మెతో ప్రభుత్వ వైద్యసేవలు అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పిహెచ్‌సి వైద్యులతో ప్రభుత్వం చర్చలు జరిపి, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించడం ద్వారా సమ్మెవిరమణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య,, సర్పంచ్ బి.వెంకమ్మ, గ్రామస్తులు పాయం భద్రయ్య, పొన్నాల రాంబాబు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఆశ్రమాల ఆకస్మిక సందర్శనలో ఎమ్మెల్యే శిరీషాదేవి



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం: శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, గుణాత్మక విద్యబోధనతో దాని సాకారానికిఉపాధ్యాయులు క్రియాశీలకంగా పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే, ఎస్‌టి సంక్షేమ కమిటీ రాష్ట్ర చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. గురువారం మండలంలోని కె. ఎర్రంపాలెం, ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యాబోధన, విద్యాప్రమాణాల స్థాయిపై పరిశీలనతోపాటు ఉపాధ్యాయులనుఅడిగి తెలుసుకున్నారు. సిలబస్ బోధనపై అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. నాణ్యమైన కూరగాయలు, ఇతర ఆహార దినుసులు వాడి భోజనం వడ్డించాలన్నారు. ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ కోతుల బెడద ఎక్కువగా ఉండడంతోపాఠశాల చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

కె. ఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాల సందర్శనలో భాగంగా ఇటీవల ఆటల పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే శిరీషాదేవి అభినందించారు. వారికి మరింత ఉత్తమ శిక్షణనిచ్చి, పైస్థాయిలో మరిన్ని పతకాలను సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అంతరజిల్లాల ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన బోలెం భరణి, కారం రిషిత, సాయి లక్ష్మిలను అభినందించారు. అలాగే పాప, మేఘన, సబిత, తబిత, లల్లీ, సంధ్య తదితర విద్యార్థులు చెస్, డిస్కస్‌త్రో,బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలవగా, వారినీ అభినందించారు.కార్యక్రమంలో కె ఎర్రంపాలెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం వై. లక్ష్మి, ఎస్ రాజేశ్వరి, వార్డెన్లు నాగదుర్గ దేవి, కె.రాజ్యలక్ష్మి, పిఇటిలు డి.సుగంది, కె.రామాయమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

ఘనంగా బాలికల దినోత్సవం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఎస్తేరు రాణి మాట్లాడుతూ, బాలికలు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బయట తిరిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పురుషుల తో పాటు మహిళలు సైతం అన్ని రంగాల్లో పోటీపడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ భవాని, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



జెసి అభిషేక్ గౌడ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

అంకితభావంతో జెసి విధులు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

-ఘనంగా వీడ్కోలు పలికిన అధికారులు

ప్రజాశక్తి -పాడేరు :అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్‌కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆయన సేవలను కొనియాడింది. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్‌గా ఒక సంవత్సరం, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఏడు నెలలు రెండు పదవులను ఒకేసారి నిర్వహించిన డాక్టర్ అభిషేక్ గౌడ్ అనుభవం భవిష్యత్తులో ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పర్యటనలు, ఆరుకు చలి వత్సవం, 108 సూర్య నమస్కారాలు వంటి పెద్ద కార్యక్రమాలను జాయింట్ కలెక్టర్ సహకారంతో విజయవంతం చేయగలిగామన్నారు. కాఫీ పంటకు బెర్రీ బోరర్ అనే తెగులు సోకినప్పుడు నష్ట నివారణ చర్యలు చేపట్టడానికి విశేష కృషి చేశారని కొనియాడారు.

ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ, ఆయన గొప్ప మార్గదర్శకులు అని, గిరిజనులకు అపారమైన సహాయం అందించారని కొనియాడారు.అసిస్టెంట్ కలెక్టర్ కే.సాహిత్ మాట్లాడుతూ, సీనియార్టీతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో జాయింట్ కలెక్టర్ తమతో పనిచేయడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు.జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేయడంతో చాలా నేర్చుకున్నానని అన్నారు. పాలనాపరంగా సహాయ, సహకారాలు అందించిన జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.వి. సందీప్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ కే. సాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలతతో పాటు పలువురు జిల్లా అధికారులు జాయింట్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందించారు కార్యక్రమంలో కలెక్టరేట్, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించరూ?

- కల్వర్టు, రహదారి పునర్నిర్మించాలని వేడుకోలు
- జర్రెల కొత్తూరు వాసుల వినూత్న నిరసన



చేతులు జోడించి వేడుకుంటున్న జర్రెల కొత్తూరు వాసులు

ప్రజాశక్తి- జికె.వీధి : బ్రిడ్జి, సరైన రహదారిలేక రాకపోకలకు తాము పడుతున్న కష్టాలకు విముక్తి కల్పించాలని మండలంలో జర్రెల కొత్తూరు గ్రామస్తులు కోరారు. గురువారం కొట్టుకుపోయిన వంతెన వద్ద చేతులు జోడించి, దండాలు పెడుతూ, వినూత్న నిరసన చేపట్టి అధికారులను వేడుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామానికి వెళ్లే రహదారిలో వాగు ఉధృతికి బ్రిడ్జి కొట్టుకు పోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయా యన్నారు. దీనిపై జిల్లా కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్‌తో పాటు సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా కనీస స్పందన లేవకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గ్రామపంచాయతీ పాలకమండలికి మొరపెట్టుకోగా, పంచాయతీ నిధులతో కొట్టుకుపోయిన బ్రిడ్జి వద్ద సిమెంట్ పైపులను అమర్చి, దానిపై మట్టిని సర్ది రాకపోకలకు తాత్కాలిక ఏర్పాట్లు చేశాయి. అయితే వర్షం కురిసినా గెడ్డ ఉప్పొంగినా తమ గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు.

దీంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి వెళ్లాలంటే డోలీ మోతలు తప్పడం లేదని, ఇక విద్యార్థులు పాఠశాలలకు వెళితే, సురక్షితంగా తిరిగొచ్చే వరకు వారి కోసం తల్లిదండ్రులు ప్రతిరోజూ బిక్కుబిక్కుమంటూ ఎదురుచూపులు తప్పడం లేదని స్థానిక గిరిజనం వాపోతున్నారు. ఎటువంటి సమస్య వచ్చినా అంబులెన్స్‌గానీ, ఇతర వాహనాలు గానీ గ్రామానికి వచ్చే వీలులేకుండా ఉందన్నారు. . భవన నిర్మాణ సామగ్రిని తెచ్చుకునే మార్గం లేకపోవడంతో గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదని వాపోయారు. దీనిపై అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా, పత్రికల్లో కథనాలు వెలువడినా అధికారులు ఇసుమంతైనా స్పందించక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు స్పందించి కొట్టుకుపోయిన కల్వర్టును శాశ్వతప్రాతిపదికన పటిష్టం చేయడంతోపాటు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి రాకపోకల కష్టాల నుంచి విముక్తి కల్పించాలని వేడుకున్నారు. ఆందోళనలో సర్పంచ్ నాగరాజు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, పంచాయతీ అధ్యక్షులు అశోక్‌చ కూటమి నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత వెంకట్

ప్రజాశక్తి-విఆర్.పురం : వెలుగు విఒఎలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లింపుతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు,గురువారం రేఖపల్లిలో విఒఎల సమావేశంలో మాట్లాడుతూ, గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు అవసరమైన సేవలు అందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న విఒఎలు కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విఒఎలకు వేతన బకాయి చెల్లింపు, కనీస వేతనం రూ.26వేలు అమలు, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, హెచ్‌ఆర్ పాలసీ అమలు, ఆన్‌లైన్ పనిభారం తగ్గింపు, 5జీ మొబైల్స్ ఇవ్వాలని, అర్హులకు సిసిలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై .ప్రభుత్వ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదని,రాష్ట్రస్థాయిలో సెర్ప్ అధికారులతో సమావేశం నిర్వహించినా పలితం లేదన్నారు. ఆన్‌లైన్ పనులకు టార్గెట్లు ఇచ్చి, వాటిపై ఒత్తిడి తెచ్చి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

15మందితో మండల కమిటీ ఏర్పాటు

సమావేశం అనంతరం 15 మందితో విఒఎల నూతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా దూలమ్మ, కార్యదర్శిగా దుర్గాదేవి, కోశాధికారిగా సుబ్బలక్ష్మి, సహాయ కార్యదర్శిగా తులసి, ఉపాధ్యక్షులుగా జ్యోతిలను ఎన్నుకున్నారు.



నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి



బియ్యం కోసం వేచివున్న వృద్ధులు

రేషన్ కోసం పడిగాపులు

వృద్ధులకు, వికలాంగులకు అమలు కాని డోర్ డెలివరీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం లోతేరు పంచాయతీ రేషన్ డిపో వద్ద లబ్ధిదారులు గురువారం ఉదయం తెలరిజాము నుండి రేషన్ బియ్యం కోసం పడిగాపులు కాశారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇంటికే డెలివరీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇంటి వద్దనే డోర్ డెలివరీ చేస్తామని ప్రచార అర్భాటానికే పరిమితం అవుతుందని, అమలు జరగ లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ లేకపోవడంతో డిపోకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, గిరిజనులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు మానుకొని డిపో వద్దనే పడిగాపులు కాసి ఉండవలసిన పరిస్థితి నెలకొంది.లోతేరు పంచాయతీ రేషన్ డిపోలో ఆన్లైన్ కాకుండా ఆఫ్లైన్లో పంపిణి అయ్యే విధంగా చర్యలు చర్యలు తీసుకోవాలని, వృద్ధులకు, దివ్యాంగులకు డోర్ డెలివరీతో రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని పంచాయితీ యువ నాయకుడు కిల్లో ప్రసాద్, పెసా కమిటీ అధ్యక్షులు కొర్రా మోహన్‌రావు, మాజీ వార్డ్ సభ్యుడు కిల్లో బీమ, రామ్మూర్తి కోరారు. లేని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

వేతనాలు చెల్లించాలని

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రం వద్ద మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. తమ బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని. నెలసరి వేతనలు పెంచాలని పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి కిల్లో. మోసియా మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, ఐదు నెలల బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెలలు తరబడి వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబాలు ఆకలితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమం ఉధృతం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు దూరు. ఈశ్వరరావు, ఎస్. రాంబాబు, డి.కృష్ణవేణి, టి.రత్నకుమారి గిరిజన సంఘం మండల నాయకులు కార్మికులు పాల్గొన్నారు

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కాలేజీ ప్రిన్సిపల్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అనస్థీషియా పాత్రను అనస్థీషియా విభాగాధిపతి సతీశ్ కుమార్ వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.హేమలతాదేవి అనస్థీషియా (మత్తు) వైద్యుల పాత్ర, సేవలను తెలిపారు. కోవిడ్ కాలంలో వారు అందించిన సేవలు అమోఘమని ప్రశంసించారు.

'ఏకలవ్య' సమస్యలు పరిష్కరించాలి

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఏకలవ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల, కళాశాలలో సమస్యలు తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసూ ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరం వద్ద గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. బయటకు వచ్చి సమస్యలను తెలుసుకున్న ఎంపిడిఓ రెండు రోజులలో ఏకలవ్య పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈనెల 25వ తేదీ లోపు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మెగా పేరెంట్స్ మీటింగ్ సమావేశం బహిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ గాసిరామ్ దొర, ఎంఎం శ్రీను, నర్సింగ్ పడాల్, తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సి వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

మండల కేంద్రంలోని ఇందిరా కాలనీ లో నివాసం ఉంటున్న ఆది నారాయణ మృతికి కారకులైన సిహెచ్‌సి వైద్యులతో పాటు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు టి.ధనుష్ కుమార్, గిద్యోని, ఎం.వెంకట్ ఎంపిడిఓకు వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓతో మాట్లాడుతూ సిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు నిర్లక్ష్యంతోనే ఆది నారాయణ మృతి చెందాడని, అంబులెన్స్ మరమ్మత్తు కు గురైన విషయం తెలిసని, వేరే అంబులెన్స్ ఏర్పాటు చేస్తామని కాలయాపన చేశారన్నారు. పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రికి తరలించాలని చెబుతూ నిర్లక్ష్యం వహించి ప్రాణాలతో చెలగాటం మారారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సిపిఎం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్, దారెల పంచాయితీ ఎంపీటీసీ పి.మల్లికార్జున, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు పాల్గొన్నారు.



వినతిని సమర్పిస్తున్న తల్లిదండ్రులు

పుస్తకాలు, ఆట వస్తువుల వితరణ

ప్రజాశక్తి -అనంతగిరి

మండలంలోని చిలకలగెడ్డ ఆదర్శ ప్రాథమిక మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు తమ సొంత డబ్బులతో నోట్ బుక్స్, పెన్నులు, ఆట వస్తువులు అందజేసినట్లు ఉపాధ్యాయులు నోకల దాసు, .నరాజీ. మల్లేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధ చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మమ్మ, సునీత, శ్రీదేవి. విద్యార్థులు పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత



సభ్యులకు సమాధానం చెపుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: స్థానిక మండల అభివృద్ధి శాఖ అధికారి ధర్మారావు, ఎంపిపి అరిసెల సీతమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండలం లోని సర్పంచులు, ఎంపిటీసీలు సమస్యలపై అధికారులను నిలదీశారు. మండల వైస్ ఎంపిపి పాటు భోగి సత్యనారాయణ, లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఏకలవ్య విద్యాలయంలో సమస్యలపై నిలదీశారు. మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి వివరణ ఇవ్వాలన్నారు. ఆయన మాట్లాడుతూ, ఏకలవ్య పాఠశాలలో రన్నింగ్ వాటర్, తాగునీటి, మరుగుదొడ్లు వంటి సమస్యలు ఉన్నాయనగా, ఏకలవ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ సుమన్‌ను సమావేశంలో పిలిపించి సమస్యలపై ఆరా తియగా పాఠశాలలోని సమస్యలు నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని ఆమె తెలిపారు. ఈ విషయంలో ఎంపీడీవో చొరవ తీసుకొని రెండు రోజుల్లో పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కారం చేసే విధంగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు. వైద్య సేవల జాప్యంతో ఆదివాసి గిరిజన ప్రాణాలు పోతున్నాయని సభ్యులు ఆగ్రహించారు. అంబులెన్స్ మరమ్మతులకు గురైనా చేయవలసిన బాధ్యత సిహెచ్‌సి సూపరింటెండెంట్ లేదని సభ్యులు ఆగ్రహించారు. సిహెచ్‌సిల్లో ల్యాబ్ అసిస్టెంట్ చేయవలసిన పనులు సెక్యూరిటీ గార్డ్ చేయటం విడ్డూరమన్నారు. ఎంఎన్‌ఆర్ఇజిఎస్ ద్వారా అందజేసిన సిల్వర్ ఓక్ మొక్కలు నాణ్యత లేవని ఆగ్రహించారు. అధిక కరెంట్ బిల్లుల మోత, లో వోల్టేజ్ సమస్య, బీటలు వారిన జనప స్తంభాలు మార్చాలి, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాట్లు, పంట పొలాల్లో నుండి విద్యుత్ స్తంభాల తొలగింపు పై చర్యలు తీసుకోవాలని వనబ సింగి సర్పంచ్ లక్ష్మణ్, కిలగడ సర్పంచ్ శశికాంత్ కోరారు. సుజనకోట ఎంపిటీసీ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ, కొత్త సుజన కోటలోని 20 జనప స్తంభాలను మార్చాలని కోరారు. జేజేఎం స్కీం లో నిర్మాణాలు చేపడుతున్న వాటర్ ట్యాంకులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. బీటీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని దారెల ఎంపీటీసీ మల్లికార్జున డిమాండ్ చేశారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బోయ తేలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జి.మాడుగుల సిఐ శ్రీనివాస్, ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాడేరు డి.ఎస్.పి షేకు సహబాద్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ కేర్ హాస్పిటల్‌కి సంబంధించిన వైద్యులతో గిరిజనులకు ఉచిత వైద్య శిబిరాన్ని పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.గిరిజనులకు సేవలు చేయడానికి విచ్చేసిన వైద్యులను సిబ్బందిని ప్రశంసించారు.ఎంపీపీ మోరియా అప్పలరాజు, కేర్ ఆస్పత్రి వైద్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో షిప్ డిజైన్ వర్క్ షాప్

ప్రజాశక్తి- కరాస: స్వావలంబనను ప్రోత్సహించడానికి, స్వదేశీ నౌక రూపకల్పన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి షిప్ డిజైన్ వర్క్ షాప్‌ను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ప్రధాన నావికా పరిశోధన ప్రయోగశాల అయిన నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) గురువారం నిర్వహించింది. భారతదేశ స్వదేశీ నౌక రూపకల్పన సామర్థ్యాలను బలోపేతం చేయడం, భారత నౌకాదళం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు (డిపిఎస్‌యులు), ప్రైవేట్ షిప్‌ష్క్రీఆర్డులు, వర్గీకరణ సంఘాలు, విద్యాసంస్థల నుండి వాటాదారుల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపును డిఆర్‌డిఒ విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వి.హరప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. నావికా వ్యవస్థలలో ఆత్మనిర్భర్ సాధించడంలో స్వదేశీ నౌక రూపకల్పన, ఆవిష్కరణల కీలక పాత్రను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎఐఎంఎల్) సాధనాలు, డిజిటల్ ట్విన్ భావనలు, మెటా-మెటీరియల్స్, అధునాతన స్టెల్త్ డిజైన్ పద్ధతులు వంటి అభివద్ధి చెందుతున్న సాంకేతికతలను భవిష్యత్ నౌక రూపకల్పన ప్రక్రియలలో అనుసంధానించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రపంచ పర్యావరణ, కార్యాచరణ ప్రమాణాలకు అనుగుణంగా నావికా రూపకల్పనను సమలేఖనం చేయడానికి గ్రీన్ షిప్ టెక్నాలజీస్, ఇంధన-సమర్థవంతమైన ప్రొపల్షన్ సిస్టమ్స్, స్థిరమైన పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు.

ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ, నీటి అడుగున వ్యవస్థలు, ఓడ హైడ్రోడైనమిక్స్, స్టెల్త్ టెక్నాలజీలలో ప్రయోగశాల సహకారాన్ని వివరించారు. ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి సాంకేతిక ఆవిష్కరణల కోసం ప్రాంతాలను గుర్తించడానికి డిజైనర్లు, ఓడల నిర్మాణదారులు, వర్గీకరణ సంఘాలు, విద్యావేత్తల మధ్య సంభాషణకు ఈ వర్క్ షాప్ ఒక ప్రత్యేకమైన వేదికను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్‌షిప్ డిజైన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ రియర్ అడ్మిరల్ సుజిత్ బాక్సీ, గిరిదీప్ సింగ్ రాధా కృష్ణ, హైడ్రోడైనమిక్స్ రీసెర్చ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లేవుడ్ కార్మికుల కూలిరేట్లు పెంచాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్లేవుడ్ ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని సిపిఎం జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లేవుడ్ ముఠా కార్మికులకు నాలుగేళ్లు అయినా కూలి రేట్లు యాజమాన్యం పెంచడం లేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఇళ్లలో అనారోగ్యంతో బాధపడేవారికి మందులు కొనలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కూలి రేట్లు పెంచాలని డిసిఎల్‌కు రెండు నెలల క్రితం విన్నవించుకున్నామని తెలిపారు.

నెలాఖరుకు శతశాతం ఇంటి పన్నుల వసూలు

పంచాయతీ కార్యదర్శులకు డిపిఒ చంద్రశేఖర్ ఆదేశం



అడ్డతీగలలో మహిళలతో మాట్లాడుతున్న డిపిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని నెలాఖరుకు శతశాతం పూర్తి చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్‌తోపాటు పలు పంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సిబ్బందికి పలు సూచనలు చేశారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ.ఇంటి పన్నుల వసూలు, పంచాయతీలు చెల్లించాల్సిన ఈఎస్ఐల బకాయిలు, ఐవిఎస్ఆర్ వాయిస్ కాల్స్‌పై సమీక్షించారు.కొందరు సర్పంచ్‌లు ఇఎస్ఎల్ బకాయిలు చెల్లింపునకు నిరాకరిస్తున్న నేపథ్యంలో వీటిని చెల్లించని పంచాయతీలకు రెండో విడత నిధుల విడుదల ఉండదని, సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చినందున రెండురోజుల్లో చెల్లింపులు చేయాలన్నారు. తర్వాత వీటిపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పంచాయతీ కార్యదర్శుల స్థాయి నుంచి డిప్యూటీ ఎంపిడిఒ, ఎంపిడిఒలు స్థాయి వరకు ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, కమిషనర్ కృష్ణతేజ ఇప్పటికే చర్యలు చేపడుతున్నారని, పంచాయతీరాజ్ ఉద్యోగులకు ప్రమోషన్లను దీపావళి కానుకగా ప్రభుత్వం ఇస్తోందన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలోని వడ్రంగి వీధిలో చెత్త సేకరణను డిపిఒ చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తడి చెత్త పొడి చెత్త సేకరణపై క్లాప్ మిత్రలకు సూచించారు. పారిశుధ్యంపై వచ్చిన ఐవిఆర్ఎస్ కాల్స్‌కు ప్రజలు స్పందించి, తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు.అనంతరం అడ్డతీగల గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులకు ఇఎస్ఎల్ సిసి ఛార్జిలు, ఇంటి పన్ను వసూళ్లు, పారిశుధ్యంపై సమీక్షించి సూచనలు చేశారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న మహాదేవన్

ప్రజాశక్తి- దేవీపట్నం: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తగు చర్యలు చేపట్టాలని ఆంధ్ర ఉద్యమాల వేదిక కన్వీనర్ మహదేవన్, రైతు కూలీ సంఘం ఎపి రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ ఝాన్సీ ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు ఇల్లా రామిరెడ్డి కోరారు. గురువారం దేవిపట్నం మండలం పెద్ద భీంపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ-3లో కొండమొదలు సర్పంచ్ వేట్ల విజయ అధ్యక్షతన నిర్వాసితులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితులు తమ సమస్యలను విన్నవించారు. ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం భూమికి భూమి ఇవ్వలేదని, అర్హతలున్నా అనేకమందికి ఆర్ఆర్ ప్యాకేజీ అందలేదని, నిర్వాసిత కాలనీల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వీధిదీపాలు, వంటి సౌకర్యాలు లేకపోగా, కొన్ని నిర్వాసిత కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతాలోపంతో శ్లాబులు కారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ఎన్నిసార్లు అర్జీలిచ్చినా అధికారులు స్పందించలేదని వాపోయారు. కార్యక్రమంలో నిర్వాసితులతోపాటు ఆయా గ్రామాల పెద్దలు తాల్లూరు వీరభద్రారెడ్డి, బడిగుంట రాజారెడ్డి, నడిపూడి గాంధిరెడ్డి, మిర్తివాడ పోసారావురెడ్డి, కుండ్ల సురేష్ రెడ్డి చదల చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



రాజవొమ్మంగిలో గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ప్రసవ కష్టాలు లేకుండా తల్లీ, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి అన్నారు. గురువారం జడ్డంగి అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి జ్యోతితోపాటు సొసైటీ మాజీ చైర్మన్ గణజాల తాతారావు మాట్లాడుతూ, గర్భధారణ నుంచి బిడ్డ పుట్టే వరకు తర్వాత కూడా అంగన్వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రసవం హైరిస్క్ కాకుండా ఉండేందుకు ఆరోగ్యసూచనలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అమ్మిరాజు, గ్రామ మహిళా పోలీస్ వీరలక్ష్మి ,టిడిపి నేతలు వాసంశెట్టి గంగాధర్, బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, ఎలిశెట్టి అప్పన్న, కంఠపురెడ్డి వీరబాబు,జడ్డంగి పీసా వైస్ ప్రెసిడెంట్ దబ్బా దివాకర్,వైద్య సిబ్బంది ఎన్.లక్ష్మి ,డి.మంజు, అంగన్వాడి వర్కర్లు బి.కనకరత్నం, ఇ.జానకమ్మ, ముంగారి చిన్నమ్ములు, కె.చిన్నారి, బి.కుమారి, ఎమ్.ముసలమ్మ, ఆశావర్కర్లు జి.వసంత కుమారి, సి.హెచ్. అరుణకుమారి పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట స్థానిక స్త్రీశక్తి భవన కార్యాలయంలో సిడిపిఒ కె.ఉమా, ఎంపిడిఒ ఎస్ సాల్మన్‌రాజ్, టిడిపి మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు, సొసైటీ చైర్మన్ మాగాపు బాబురావు, వైద్యాధికారి కె.చైతన్య ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిచంరాఉ. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఇందుకూరుపేట వైద్యాధికారి ఎన్ చైతన్య మాట్లాడుతూ గర్భిణులకు ఆరోగ్యసూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు కె. అమ్మాజీ, వై రామలక్ష్మి, పి వెంకటలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది హెచ్ వి వసంత, ఎం జోగమ్మ, ఏఎన్ఎం మంజుల మంగ పాల్గొన్నారు.

గంగవరం : పౌష్టికాహారంతో ఆరోగ్యమని ఎంపిపి పల్లాల కష్టారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొమరవరం అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ సుచరిత, ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్రీయపోషణ్ అభియాన్‌లో భాగంగా పోషకాహారంపై అంగన్వాడీ లబ్ధిదారులు, స్థానికులకు అవగాహన కల్పించారు. తక్కువ ధరకే ఎక్కువ పోషక విలువలున్న పదార్థాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కుమారి, అంగన్వాడీ వర్కర్ రామయమ్మ పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో పౌష్టికాహార మాసోత్సవాలు

ముంచింగిపుట్టు: స్థానిక వెలుగు కార్యాలయ సమావేశం మందిరంలో సిడిపిఒ విమల కుమారి ఆధ్వర్యంలో గురువారం పోషణ మాసోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు ఎంపీపీ సీతమ్మ, మండల పరిషత్ కార్యాలయ ఏవో సూర్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ కె రామారావు పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని లబ్ధిదారులు వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలోని సీతగుంటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ స్రవంతి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పిల్లలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్యాం సుందర్, ఏఒ పూర్ణయ్య, ఎంఇఒ-2 గుమ్మా పుష్పజోష్, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవీపట్నంలో గర్భిణులకు సీమంతాలు



గంగవరంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి



పెదబయలులో గర్భిణులకు సీమంతాలు

వరద బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి విఆర్.పురం: మండలంలోని చిన్న మట్టపల్లి గ్రామపంచాయతీ చింత రేగుపల్లి, గుండుగూడెం, అన్నవరం, చొక్కానపల్లి, వడ్డిగూడెం కాలనీ. కూనవరం మండలం ఉదయభాస్కర్ కాలనీ తదితర గ్రామాలకు చెందిన 450 వరద బాధిత కుటుంబాలకు గురువారం స్థానిక నాయకుడు ములగల వెంకటరమణ ఆధ్వర్యంలో విశ్వ ప్రగామి వయోజన సంస్థ ప్రతినిధులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఇటీవల గోదారి,శబరి వరదలకు రహదారులు మునగడంతో మూడు నెలలుగా రాకపోకలు నిలిచి బాధిత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో ఒక్కో కుటుంబానికి రూ. 2500 విలువైన 25 కిలోల బియ్యం, రెండు లీటర్ల నూనె, రెండేసి కిలోల కందిపప్పు, చక్కెర, స్నానపు సబ్బులు, డిటర్జెంట్ సబ్బులు, 250 గ్రాముల టీ పొడి, 1 కిలో కారం, 100 గ్రాముల టూత్ పేస్ట్, పసుపు పొడి తదితర సామగ్రితో కూడిన కిట్‌లను అందజేశారు.

భారీ వర్షాలు, వరదలకు గోదారి, శబరి నదులు ఉప్పొంగడంతో సంగమ ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అధికారులు, నేతలు పట్టించుకోని పరిస్థితుల్లో విశ్వ ప్రగామి వయోజన సంస్థ ముందుకొచ్చి వరద బాధిత కుటుంబాలను నిత్యావసరాలను ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జి.శివా రెడ్డి జి.స్టీఫెన్, ఎం.నానాజీ, పీసా కమిటీ సభ్యులు జయరాజువిశ్వప్రగామి సిబ్బంది , ఎ.విజయ్‌రావు విఆర్ పురం చర్చి పాస్టర్ డేవిడ్, పెద్దమటపల్లి సువార్తికుడు బోయేజ్, కోటూర్ పాస్టర్ మోజెస్ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, స్థానిక నేతలు

సూపర్ జిఎస్‌టిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో వాణిజ్యసముదాయం వద్ద సచివాలయ ఉద్యోగులతో కలిసి స్థానిక టిడిపి నేతలు గణజాల తాతారావు తదితరులు గురువారం అవగాహన కల్పించారు. జిఎస్‌టి తగ్గింపులతో దసరా, దీపావళి పండుగలకు తగ్గిన ధరలకు గృహోపకరాలను కొనుగోలు చేసుకునే వీలుందన్నారు. తగ్గిన ధరలతో వ్యాపారాలు పెరిగాయని, అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసంశెట్టి గంగాధర్, బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, పీసా వైస్ ప్రెసిడెంట్ దబ్బా దివాకర్, జడ్డంగి టిడిపి అధ్యక్షుడు కంఠపురెడ్డి వీరబాబు సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు దొర, మహిళా పోలీస్ వీరలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ నారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సన్యాసిరెడ్డి, ఎఎన్ఎం మంజు పాల్గొన్నారు.



రంపచోడవరంలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

రంపచోడవరం : సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ ఎంవిఐ రాజేష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి దేవి గుడి వరకు కరపత్రాలను పంచుతూ, వాహనాల ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. తగ్గిన జిఎస్‌టితో వాహన కొనుగోలుదారులకు ప్రయోజనం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో హోండా, యమహా, బజాజ్ హీరో షోరూంల యజమానులు, సిబ్బంది, ఆర్‌టిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐగా యాసిన్

ప్రజాశక్తి -సీలేరు : జికె. వీధిమండలం సీలేరు ఎస్ఐగా ఎండి యాసిన్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం ఎస్ఐగా పనిచేస్తున్న యాసిన్‌ను సీలేరుకు బదిలీ చేశారు. కాగా సీలేరు ఎస్ఐ కె.రవీంద్రను పాడేరు స్పెషల్ బ్రాంచ్‌కుబదిలీ చేస్తూ ఎస్పీ అమిత్ బర్ధర్ ఉత్తర్వులు జారీ చేశారు.సీలేరు పోలీస్ స్టేషన్‌లో 11 నెలలపాటు ఎస్ఐగా రవీంద్ర ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు.




ఎస్ఐ ఎండి యాసిన్

బాణసంచా అమ్మకాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- మోతుగూడెం : దీపావళికి అనుమతులు పొందిన బాణసంచా అమ్మకందారులు తగు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ఎస్ఐ చరణ్‌నాయక్ సూచించారు. జిల్లా ఎస్పి అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు చింతూరు ఎఎస్‌పి పంకజ్‌కుమార్ మీనా ఆధ్వర్యంలో చింతూరు ఎస్ఐ గోపాలకృష్ణ పర్యవేక్షణలో బాణసంచా అమ్మకాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అమ్మకందారులు విధిగా అనుమతులు పొంది ఉండాలని, దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తగ్గట్టుగా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- జికె. వీధి : మండలంలోని కె.కొడిసింగి గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ వీరేంద్రప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్